సాక్షి
వికారాబాద్
మంగళవారం । 5 । మార్చి । 2024



పశువులు పైలం

ఎండ తీవ్రత పెరుగుతుండటంలో పశువుల సంరక్షణపై పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో▸



వంద ట్రాక్టర్ల ఇసుక సీజ్

ఇసుక మాఫియా ఆగడాలకు అధికారులు చెక్ పెట్టారు. డంపింగ్ యార్డు వద్ద వంద ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. 8లో▸



ప్రణాళిక సిద్ధం చేయండి

రబీ సీజన్‌కు సంబంధించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. 9లో▸

న్యూస్‌రీల్

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అడ్మిషన్లు

వికారాబాద్ అర్బన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్, రామంతాపూర్ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఒకటవ తరగతిలో ప్రవేశానికి గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్ మల్లేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లంబాడ – 4, ఎరుకల, చెంచు –1, ఇతర గిరిజన తెగలు –1, ఎస్టీ బాలుర – 3, ఎస్టీ బాలికలు – 3 సీట్లు ఉన్నట్లు తెలిపారు. పిల్లలు జిల్లాకు చెందిన వారై ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షలు ఉండాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 4నుంచి 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ల 86393 88553, 99085 98481లో సంప్రదించాలని కోరారు.

11న జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: వికారాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 11న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిషిప్ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ నరేంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఇంటర్, ఒకేషనల్, డిగ్రీ, డిప్లమా, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు హాజరు కావచ్చని తెలిపారు. తోషిబా, మహేంద్ర – మహేంద్ర, మారుతి సుజుకి, కార్తికేయ ఇండస్ట్రీ, నియాన్, టీఎస్ ఆర్టీసీ, పెన్నార్, వోల్టా గ్రీన్, సౌత్ సెంట్రల్ రైల్వే వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 11వ తేదీ ఉదయం 9:30 గంటలకు బయోడేటా, ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9441430963, 8499975115లో సంప్రదించాలని కోరారు.

‘ధరణిలో భూమి మాయం !

కొందుర్గు: ఓ రైతు బతికుండగానే మరణించినట్లు ధ్రువీకరించి సదరు ఇతని భూమిని ఇతరుల పేర్లపై పట్టామార్పిడి చేసిన సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేటలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం గడ్డం వెంకటయ్యకు శేగిరెడ్డిగణపూర్ శివారులోని 16/26/అ2 సర్వేనంబర్‌లో 10 గుంటలు, 222/3లో 20 గుంటల భూమి ఉంది. ఇందులో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయనకు మల్లేశ్, నర్సింలు ఇద్దరు కొడుకులతో పాటు మరో కూతురు ఉంది.అయితే రైతు వెంకటయ్య మరణించినట్లు ధ్రువీకరణ పత్రాన్ని జతచేసి.. 30 గుంటల భూమిని ఇదే వీరన్నపేటకు చెందిన తిమ్మగళ్ల గాయత్రి, హన్మగళ్ల మమత పేర్లపై అధికారులు విరాసత్, పట్టా మార్పిడి చేశారు.

రైతుబంధు రాలేదని..

వెంకటయ్యకు ముప్పై గుంటలే భూమే ఆధారం. రైతుబంధు రాకపోవడంతో అనుమానం వచ్చి ఆన్‌లైన్‌లో చూడటంతో అసలు సంగతి బయటపడింది. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా తనకు న్యాయం చేయలేదని బాధితుడు వాపోయాడు. ఈ విషయమై అడిగేందుకు తహసీల్దార్‌కు జగదీశ్వర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు.

లోక్‌సభ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా



కార్యక్రమంలో పాల్గొన్న వైశ్య వికాస వేదిక ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని పార్టీలు కనీసం రెండు టికెట్లు కేటాయించాలని వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో సోమవారం చంపాపేటలోని లక్ష్మీ కన్వెన్షన్‌హాల్‌లో ‘పార్లమెంటు ఎన్నికలు– వైశ్యుల పాత్ర’పై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. 20 సంవత్సరాల నుంచి పార్లమెంటులో వైశ్యులకు ప్రాధాన్యత లేకపోవడం బాధాకరమన్నారు. రాజకీయ పరంగా వైశ్యుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీఆర్ఎస్ ఉద్యమకారునికి మల్కాజిగిరి టికెట్ కేటాయిస్తే వైశ్యులందరూ ఆ పార్టీ వెంట నడిచి అభ్యర్థిని గెలిపించేందుకు శాయాశక్తుల కృషి చేస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. 2014, 2018, 2023లో కాంగ్రెస్ పార్టీ ఒక ఎమ్మెల్యే గాని ఒక ఎంపీ గాని కేటాయించలేదని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ కూడా ఎన్నికల్లో కనీసం రెండు సీట్లు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక సభ్యులు నంగునూరి రమేష్, రామ్‌నరేష్ పాల్గొన్నారు.

గడువు 20రోజులే..

పన్నుల వసూలులో లక్ష్యం చేరుకోని పంచాయతీలు

- రూ.9.69 కోట్లకు గాను రూ.7.31 కోట్లే వసూలు
- ఇంకా రావాల్సిన మొత్తం రూ.2.38 కోట్లు
- జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు
- నివాసాలు 1,85,657



పరిగి మండలం బసిరెడ్డిపల్లిలో పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

వికారాబాద్: పన్నుల వసూలులో ఈ సారి జిల్లా పంచాయతీ విభాగం కాస్త వెనుకబడింది. రెండు నెలల క్రితం వరకు దూకుడు ప్రదర్శించిన ఆ శాఖ ఇటీవల నెమ్మదించింది. గత ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి 90శాతం వసూలు చేయగా, ఈ సారి 75శాతం వద్దే ఉన్నారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి మరో 20 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. ఇంకా 25శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉంది. వంద శాతం పన్నుల వసూలుకు కృషి చేస్తున్నామని అధికారులు తెలిపారు. పని ఒత్తిడి ఉన్నా పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూలులో పురోగతి సాధించేందుకు శ్రమిస్తున్నారని తెలిపారు.

పెండింగ్‌లో 25శాతం

జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు, 1,85,657 నివాసాలు ఉన్నాయి. పంచాయతీలు, మండలాల వారీగా 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల డిమాండ్ ఆధారంగా లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా రూ. 9,69,51,958 పన్నులు వసూలు చేయాల్సి ఉంది. ఇందులో ఇళ్ల పన్నుల రూపంలో రూ.9,06,20,112, నాన్ ట్యాక్స్ ద్వారా రూ.63,31,846 వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు నాన్ ట్యాక్స్‌కు సంబంధించి రూ.47,45,016 వసూలు చేశారు. పన్నుల రూపంలో రూ.6,83, 79,218 వసూలు చేశారు. మొత్తంగా రూ. 7,31,24,234 అంటే 75.42శాతం పన్నుల వసూ లు పూర్తయ్యాయి. ఇంకా రెండు రకాల పన్నులు కలిపి రూ. 2,38,27,724లు అనగా 25శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉంది. ధారూరులో 86శాతం, వికారాబాద్, కుల్కచర్ల ప్రాంతాల్లో 83శాతంతో ముందు వరుసలో ఉన్నాయి. మర్పల్లి 63శాతం, దౌల్తాబాద్, యాలాల మండలాల్లో 64శాతంతో వెనుకబడి ఉన్నాయి.

అన్ని అనుమతులు ఆన్‌లైన్‌లోనే..

గ్రామ పంచాయతీల అన్ని సేవలను ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొచ్చింది. ఇళ్ల అనుమతులు, పన్నులు, నాన్ ట్యాక్స్‌లు ఆన్‌లైన్‌లోనే వసూలు చేస్తున్నారు. ఇళ్ల పన్నులే గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు. ఇళ్ల అనుమతులు, జరిమానాలు, సంతల ద్వారా వచ్చే ఆదాయం, వ్యాపార సముదాయాలకు విధించే జరిమానాలు, పన్నులు, అనుమతులు తదితర సేవల ద్వారా సమకూరే నిధులను నాన్ ట్యాక్స్‌ల కింద లెక్కిస్తారు. అయితే ఇంటి పన్నుల వసూలులో పారదర్శకత బాగానే కనిపిస్తున్నా.. నాన్ ట్యాక్స్‌ల వసూలు విషయంలో చాలా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫాంహౌస్‌లు, వ్యాపార సముదాయాలకు పంచాయతీల పాలక వర్గాలు పన్నులు సక్రమంగా విధించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

లక్ష్యం చేరుకుంటాం

జిల్లాలో పన్నుల వసూలు 75శాతం దాటింది. నాన్ ట్యాక్స్‌ల విషయంలో కాస్త వెనుకబడిన మాట వాస్తవమే. త్వరలో 100శాతం లక్ష్యం చేరుకుంటాం. ఆ దిశగా తమ సిబ్బంది పని చేస్తోంది. ప్రజలు సక్రమంగా పన్నులు చెల్లించినప్పుడే నాణ్యమైన సేవలు అందుతాయి. జవాబుదారీ తనం పెరుగుతుంది.

– జయసుధ, డీపీఓ



బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న నవీన్

క్యాన్సర్ బాధితుడికి సీఎం భరోసా

- నవీన్‌కు వైద్యసేవలు అందించాలని ఆదేశం
- ట్విట్టర్‌లో స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కుల్కచర్ల: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఇంటర్ విద్యార్థికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్విట్టర్ ద్వారా భరోసా ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కుల్కచర్ల మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన వడ్డె సత్తయ్య కుమారుడు నవీన్‌కుమార్ కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా కోలుకోలేదు. చివరకు మహబూబ్‌నగర్‌లోని ఆరోగ్యపాలి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించగా.. బ్లడ్ క్యాన్సర్ ఉండే అవకాశం ఉందని వైద్యులు చెప్పారు. దీంతో హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి తరలించగా వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఆరోగ్య శ్రీలో క్యాన్సర్‌కు చికిత్స లేదని, డబ్బులు చెల్లించాలని నిర్వాహకులు పేర్కొన్నారు. బాధితుడి పరిస్థితిని గమనించిన పలువురు ఈ విషయమై సీఎం రేవంత్‌కు ట్వీట్ చేయగా.. ఆయన స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బదులిచ్చారు. నవీన్ సంపూర్ణ ఆరోగ్యంతో మన మధ్యకు రావాలని సీఎం ఆకాంక్షించారు.



సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్

సీఎం ట్విట్టర్‌లో స్పందించడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇదిలా ఉండగా.. నవీన్ మహేశ్వరం జ్యోతిరావుపూలే కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అనారోగ్యం కారణంగా ప్రస్తుతం జరుగుతున్న వార్షిక పరీక్షలకు హాజరు కావడం లేదు.



గుడ్లను కాల్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అంగన్‌వాడీ గుడ్ల పారబోతపై విచారణ

ధారూరు: అంగన్‌వాడీ గుడ్లు పాలం పాలు అనే శీర్షికన ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు సోమవారం అధికారులు స్పందించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జ్యోతిపద్మ, సీడీపీఓ వెంకటేశ్వరమ్మ, సూపర్‌వైజర్లు మండలంలోని నాగారంలో పర్యటించారు. గుడ్లు పడేసిన శంకరయ్య పొలాన్ని సందర్శించారు. అక్కడ పారబోసిన గుడ్లను కాల్చివేయడాన్ని గుర్తించారు. ఈ నేపథ్యంలో అధికారులు నాగారం, మోమిన్‌ఖుర్దు, మైలారం, బోజ్యానాయక్ తండా,నాగారం తండా, మైలారం ముందలి తండా, నాగ్‌సాన్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులు సరిగ్గా ఉన్నాయని జిల్లా అధికారి జ్యోతిపద్మ తెలిపారు. పారబోసిన గుడ్లను పంచాయతీ సిబ్బంది కాల్చివేసినట్లు తమ విచారణలో తేలిందని, పూర్తి వివరాలు సేకరిస్తామని చెప్పారు.

గుడ్లపై చార్మినార్ జోన్ – 6 స్టాంపు

నాగారంలో పారబోసిన గుడ్లపై చార్మినార్ జోన్ జోన్ – 6 స్టాంపు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అక్కడి గుడ్లు ఇక్కడికి ఎలా వచ్చాయి అనే దానిపై విచారణ చేపట్టారు. తనిఖీలో సీడీపీఓ వెంకటేశ్వరమ్మ, సూపర్‌వైజర్లు సుశీల, కళావతి, షాలిని, నరసమ్మ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: నిర్ణీత గడువులో ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి పెండింగ్ దరఖాస్తులను ఆర్ఎస్ఆర్ ప్రకారం సత్వరం పరిష్కరించాలన్నారు. రీ సర్వే సెటిల్మెంట్ రిజిస్టర్ ప్రకారం సర్వే నంబర్ల వారీగా గ్రామ పంచాయతీ బోర్డుపై ప్రదర్శించాలన్నారు. ఎన్ని దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి.. ఇప్పటి వరకు ఎన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ధరణి ఆపరేటర్లు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

జిల్లాలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో మాట్లాడారు. పంచాయతీ భవన నిర్మాణాల్లో వేగం పెంచి అందుబాటులోకి తేవాలని సూచించారు. బొంరాస్‌పేట్, కొడంగల్ మండలాల్లో సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రహరీలు, వంట గదుల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా అన్ని మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలు, టీఏలతో మాట్లాడారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న కూలీందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. క్లస్టర్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఊరికి ఉపయోగపడే పనులు చేపట్టాలని సూచించారు. సమస్యలు ఉంటే మండల అధికారుల దృష్టికి తేవాలన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అందేలా చూడాలన్నారు. ఎక్కడైనా వాటర్ పైపులు లీకేజీ అయితే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి సుధారాణి, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, గ్రిడ్ ఈఈ చల్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నిర్ణీత గడువులో పరిష్కరించాలి

పరిగి: ధరణి దరఖాస్తులను ఈ నెల 9వ తేదీలోగా పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. మండలంలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని పరిష్కరించారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రశాంత వాతావరణంలో ఇంటర్ వార్షిక పరీక్షలు జరుగుతున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు, వసతులపై ఆరా తీశారు. 267మందికి గాను 261 విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, ప్రిన్సిపాల్ అంజయ్య, చీఫ్ సూపరింటెండెంట్ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

‘కారు’లో కుదుపు

- ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ పార్టీ వీడుతున్న నేతలు
- మొన్న మాజీ ఎమ్మెల్యే తీగల, రంగారెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్లు
- తాజాగా బండ్లగూడ జాగీర్ మేయర్ సహా మరో ముగ్గురు కార్పొరేటర్లు!
- ‘హస్తం’ గూటికి చేరుతున్న నాయకులు
- చేవెళ్ల లోక్‌సభ పరిధిలో పట్టు బిగిస్తున్న కాంగ్రెస్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు షాక్ మీద షాక్ తగులుతోంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, సహా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌లు ఆ పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సహా మరో ముగ్గురు కార్పొరేటర్లు ఆ పార్టీ అధిష్టానానికి షాక్ ఇచ్చారు. వీరంతా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షిని కలిశారు. ఇప్పటికే ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సైతం సీఎంను కలవడం చర్చనీయాంశమైంది. మర్యాదపూర్వంగానే తాము సీఎంను కలిసినట్లు చెబుతుండటం విశేషం. ఈ హఠాత్ పరిణామంతో ఇప్పటికే మేయర్‌పై అవిశ్వాసాన్ని ప్రకటించిన డిప్యూటీ మేయర్ వర్గం డైలమాలో పడిపోయింది.

చేవెళ్ల పరిధిలో మారుతున్న పరిణామాలు

చేవెళ్ల లోక్‌సభస్థానం పరిధిలో వికారాబాద్, పరిగి, తాండూరు, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో వికారాబాద్, పరిగి, తాండూరు మినహా మిగిలిన అన్ని స్థానాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లతో పోలిస్తే ఆపార్టీకి 80 వేలకుపైగా అధికంగా ఓట్లు వచ్చాయి. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డే మళ్లీ ఇక్కడి నుంచి పోటీ చేయనున్నట్లు బీఆర్ఎస్ అధిష్టానం ప్రకటించింది. అభ్యర్థి పేరు ప్రకటన తర్వాత ఈ నియోజకవర్గం పరిధిలో అనేక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. అప్పటికే ఈ ఎంపీ స్థానాన్ని ఆశిస్తున్న పట్నం కుటుంబం బీఆర్ఎస్‌ను వీడి, హస్తం గూటికి చేరుకుంది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పట్నం సునితారెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేయనున్నారనే సంకేతాలను ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే ఆలోచనతో అప్పటి వరకు బీఆర్ఎస్‌తో తమ వెంట ఉన్న కేడర్‌ను సైతం కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చారు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సహా ఆయన కోడలు జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డిని కూడా పార్టీలోకి చేర్పించి సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేశారు. ఎన్నికలు సమిపిస్తున్న వేళ లోక్‌సభా స్థానం పరిధిలోని కీలక నేతలంతా ఒకరి తర్వాత మరొకరు వరుసగా పార్టీని వీడుతుండటం బీఆర్ఎస్ అధిష్టానానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఈ లోక్‌సభ స్థానం నుంచి మళ్లీ పోటీ చేయడం కంటే.. ఇందుకు దూరంగా ఉండటమే ఉత్తమమనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పోటీకి అంగీకరించడం లేదనే ప్రచారం కూడా జరుగుతోంది. సిట్టింగ్ ఎంపీ అభ్యర్థి పోటీకి విముఖత చూపుతుండటంతో ప్రత్యామ్నాయంగా అదే సామాజిక వర్గానికి చెందిన బలమైన నేతను బరిలోకి దింపాలనే యోచనలో బీఆర్ఎస్ అధిష్టానం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.



సీఎం రేవంత్‌ను కలిసిన బండ్లగూడ మేయర్, కార్పొరేటర్లు

ఆ వర్గంలో అయోమయం

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 22 డివిజన్లు ఉన్నాయి. గత ఎన్నికల్లో 14 బీఆర్ఎస్ కైవసం చేసుకోగా, ఎంఐఎం –1, బీజేపీ –2 గెలుపొందాయి. మరో ఐదు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు అప్పటి అధికార బీఆర్ఎస్‌లో చేరారు. మేయర్, డిప్యూటీ మేయర్ రెండు పదవులు బీఆర్ఎస్సే చేజిక్కించుకుంది. ఆ తర్వాత ముగ్గురు మినహా మిగిలిన వారంతా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. మేయర్ల ఒంటెద్దు పోకడలు నచ్చని కొంత మంది కార్పొరేటర్లు ఆయనపై ఇటీవల అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. కలెక్టర్ 34రోజుల గడువు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ మేయర్ కోర్టును ఆశ్రయించగా కోర్టు స్టే విధించింది. నిజానికి డిప్యూటీ మే యర్ వర్గమే ముందు పార్టీ వీడనుందనే ప్రచా రం జరిగింది. ఆ మేరకు కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. అనూహ్యంగా సోమ వారం మేయర్ సహా మరో ముగ్గురు కార్పొరేటర్లు, కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సైతం కారు దిగి.. హస్తం గూటికి చేరుకోవడంతో అసంతృప్తి వర్గం అయోమయంలో పడిపోయింది.

క్లుప్తంగా

కొడంగల్‌ సీఐ బదిలీ


సీఐ రాములు

కొడంగల్‌: కొడంగల్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాములు బదిలీ అయ్యారు. పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో ఆయనను హైదరాబాద్‌ సిటీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆదివారం రాత్రి కొడంగల్‌ నుంచి రిలీవ్‌ అయి హైదరాబాద్‌లో బాధ్యతలు చేపట్టినట్లు సీఐ రాములు చెప్పారు. ఇన్నాళ్లు ఆయనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల అధ్యాపకులకు సన్మానం


గురుకుల ఉద్యోగాలు సాధించిన అధ్యాపకులను సన్మానిస్తున్న ఫోరం సభ్యులు

తాండూరు టౌన్‌: ఇటీవల విడుదలైన ఫలితాల్లో గురుకుల అధ్యాపకులుగా ఉద్యోగాలు సాధించిన తాండూరుకు చెందిన వారిని స్థానిక ప్రైవేట్‌ లెక్చరర్స్‌ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పీపుల్స్‌ డిగ్రీ కళాశాల ఆవరణలో పలు కళాశాలలకు చెందిన అధ్యాపకులు వారికి శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఉస్మాన్‌ టీజీటీ బయోసైన్స్‌, టీజీటీ జనరల్‌ సైన్స్‌లో, శ్రీనివాస్‌ గురుకుల కామర్స్‌ జేఎల్‌, టీజీటీ సోషల్‌ స్టడీస్‌లో, శివలీల గురుకుల జేఎల్‌ జువాలజీలో ఉద్యోగాలు సాధించారు. వీరిని ఫోరం తరఫున సన్మానించారు.

బురుజును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కి వినతిపత్రం అందజేత


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దోమ: గ్రామంలో పురాతన బురుజును కూల్చడమే కాకుండా, ఆ స్థలాన్ని కబ్జాలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఐనాపూర్‌కి చెందిన బహుజన ఉద్యమకారుడు గార్లపల్లి మల్లన్న, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గోవర్దన్‌ కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ కార్యాలయంలో కలెక్టర్‌ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐనాపూర్‌ గ్రామంలో ఉన్న పురాతన బురుజును కొందరు వ్యక్తులు తొలగించారని, ఆ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు నిర్మాణాలు చేపడుతున్నారని వివరించారు. ఈ విషయంపై గతంలో అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. కలెక్టరు వెంటనే స్థలాన్ని పరిశీలించి గ్రామస్తులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్‌ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాములు, నారాయణ, ఆంజనేయులు, వెంకట్‌రాములు, నర్సింహ, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజేంద్రనగర్‌ సర్కిల్‌ జర్నలిస్టులకు క్రికెట్‌ పోటీలు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ ఎలక్ట్రానిక్‌ అండ్‌ ప్రింట్‌ మీడియా జర్నలిస్టుల ఆధ్వర్యంలో మంగళవారం క్రికెట్‌ పోటీలు నిర్వహించనున్నట్లు జర్నలిస్టుల ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, భీమయ్య, భుజంగారెడ్డి, ఆంజనేయులు, బాల సుబ్రమణ్యం తెలిపారు. శివరాంపల్లిలోని ఓ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. విజయానంద్‌ గార్డెన్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూడు మ్యాచులు ఏర్పాటు చేశామని తెలిపారు. 78 మంది నాలుగు జట్లుగా పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు సాయంత్రం బహుమతులను అందజేస్తామన్నారు. జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు, పిల్లలకు మ్యూజిక్‌ చైర్‌ , లెమన్‌ స్పూన్‌ తదితర పోటీలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వేసవి కాలం.. పశువులు పైలం

- ఎండదెబ్బ తగిలి మృత్యువాత పడే అవకాశం
- సాధ్యమైనంత ఎక్కువగా నీళ్లు తాగించాలి
- జాగ్రత్తలు పాటిస్తేనే అధిక పాల ఉత్పత్తి
- మండల పశువైద్యాధికారి శ్రీప్రియ


శ్రీప్రియ, మండల పశువైద్యాధికారి

నవాబుపేట: వేసవికాలం ఎండలు జీవకోటికి ప్రాణాంతకంగా మారనున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అడుగు బయట పెట్టాలంటే ప్రజలు జంకుతున్నారు. ఈ తరుణంలో మూగజీవాల పరిస్థితి దయనీయంగా మారుతోంది. వేసవితాపం నుంచి వాటిని రక్షించడానికి పాడి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ బారిన పశువులు పడకుండా మండల పశువైద్యాధికారి శ్రీప్రియ పలు సూచనలు చేశారు.

వడదెబ్బకు ఎలా గురవుతాయి

- ఉష్ణోగ్రత, గాలిలో తేమ ఎక్కువైనప్పుడు పశువులు వడదెబ్బకు గురవుతాయి.
- పశువులకు గాలి ప్రసరణ లేని ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసి ఉంచినప్పుడు, నీటి సౌకర్యం లేనప్పుడు పశువులు అధిక శ్రమకు గురవుతాయి. వడగాడ్పులు వీచినప్పుడు వడదెబ్బ బారిన పడతాయి.
- తెల్లజాతి కంటే నల్లజాతి పశువులు త్వరగా వడదెబ్బకు గురవుతాయి.
- వేసవికాలంలో బయట కంటే పశువుల శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉన్నప్పుడు మెదడులోని హైపోథాలమస్‌ స్వేద గ్రంథుల నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతుంది. ఈ సమయంలో స్వేద గ్రంథులు చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్‌ కోల్పోయి జీవ ప్రక్రియ మందగిస్తుంది.


నారెగూడలో ఎండలో మేత మేస్తున్న గేదెలు (ఫైల్‌)

- శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడివేగం పెరుగుతాయి. మూత్రపిండాలు పని చేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది.
- ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి వెళ్లి శ్వాస ఆడక మరణిస్తాయి.

లక్షణాలు

- వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల ఫారిన్‌ హీట్‌ కంటె ఎక్కువగా ఉంటుంది.
- చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటి నుంచి చొంగ పడుతుంది.
- పశువులు బలహీనంగా తయారవుతాయి. సరిగా నడవలేక తూలుతూ చెట్ల కింద పడుకోవడానికి ప్రయత్నిస్తాయి.
- అధిక దాహం కలిగి ఉంటాయి. శరీర ఉష్ణోగ్రత 104 ఎఫ్‌ దాటితే శ్వాస పీల్చడం కష్టమవుతుంది. క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి.
- వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువుల్లో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడి తాత్కాలిక వంధత్వం ఏర్పడి పాల దిగుబడి తగ్గుతుంది.

చికిత్స

- వడదెబ్బకు లోనైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే నీడ ప్రాంతానికి మార్చాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేర్చడానికి చల్లని నీటితో పలుమార్లు కడగాలి. తడి గోనే సంచులు కప్పి నీళ్లు చల్లాలి. వెంటనే పశువైద్యులను సంప్రదించాలి.
- పశు వైద్యుల పర్యవేక్షణలో శరీర ఉష్ణోగ్రత, నొప్పులు తగ్గించడానికి అనాల్జిన్‌ ఇంజెక్షన్‌ వేయాలి.
- వడదెబ్బ లక్షణాలు తగ్గించడానికి, పశువులను మగతలో ఉంచడానికి క్లోరోపామజిన్‌ వంటి ట్రాంక్విలైజర్స్‌ వాడాలి.
- రక్తంలోని డెక్స్ట్రోజ్‌ సెలెన్‌ ఎక్కించడం ద్వారా శరీరానికి సరిపోను గ్లూకోజ్‌, ఎలక్ట్రోలైట్లు అంది పశువులు నీరసం నుంచి బయటపడతాయి.

నివారణ చర్యలు

- పశు పోషకులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి వడదెబ్బ బారి నుంచి రక్షించుకోవచ్చు.
- వేసవిలో ముఖ్యంగా పగటి వేళల్లో పశువున్ని మేతకు వదలకూడదు. ఉదయం సాయంత్రం చల్లగా ఉండే సమయాల్లో మాత్రమే బయట తిరగనివ్వాలి. తాగునీరు అన్ని వేళలా అందుబాటులో ఉండాలి.
- పశువులను రోజూ 3–4 సార్లు చల్లని నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకరజాతి ఆవులు, మాలి గేదెలు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. వాటిపై తరచూ నీళ్లు చల్లుతూ ఉండాలి. నీటి చెరువులు, కుంటలు ఉన్న చోట పశువులను ఈదనివ్వాలి.
- గాలి, వెలుతురు బాగా ప్రసరించేటట్లు ఎత్తైన పశువుల కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకుల కప్పు కొట్టాలపై వరి గడ్డి కప్పి, మధ్యాహ్నం వేళలలో నీళ్లు చల్లాలి. వడగాలి ప్రభావం పడకుండా గోనె సంచి పరదాలు కట్టి నీళ్లు చిలకరించాలి.

పెండింగ్‌ వేతనాలు వెంటనే చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ నాయకుల ధర్నా

యాలాల: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీల్లో వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎనిమిది నెలలుగా జీతాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అరకొర జీతంతో నెట్టుకొచ్చే కార్మికులకు వేతనాలను ప్రతి నెలా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పెండింగ్‌ వేతనాలతో పాటు అందరికీ సమానంగా వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికుడికి రూ.10వేల పింఛను, విధి నిర్వహణలో చనిపోయిన వారికి నష్టపరిహారం రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌, బుగ్గప్ప, నాయకులు షబ్బీర్‌, ఆనందం, లచ్చప్ప, నర్సింహులు, ఆరీఫ్‌, ఫరీద్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు


ఘటనాస్థలిలో స్పృహ తప్పి పడిపోయిన చంద్రయ్య

ధారూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తల పగిలి రక్త గాయాలై స్పృహ తప్పి పడిపోయిన సంఘటన మండల కేంద్రంలోని బస్టాండు వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాలాల మండలం సంగెం గ్రామానికి చెందిన నల్ల చంద్రయ్య(57) పని నిమిత్తం లూనాపై వికారాబాద్‌కు బయలుదేరారు. ధారూరు మీదుగా వెళుతూ తాండూర్‌–హైదరాబాద్‌ మెయిన్‌ రోడ్డుపైకి వచ్చారు. అదే సమయంలో వికారాబాద్‌ నుంచి తాండూరుకు వెళుతున్న లారీ, లూనాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రయ్య తల పగిలి లూనాతో పాటు రోడ్డుపైనే స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో రెండు వైపులా రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు 108 వాహనానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం వికారాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

డ్రగ్స్‌ నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న తిరుమలేశ్‌

కొడంగల్‌: మాదక ద్రవ్యాల నివారణపై స్థానిక జిల్లా పరిషత్‌ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో డ్రగ్స్‌ ప్రధాన సమస్యగా మారిందని వక్తలు పేర్కొన్నారు. డ్రగ్స్‌, మత్తు పదార్థాల నివారణపై పాఠశాల డ్రాయింగ్‌ మాస్టర్‌ తిరుమలేశ్‌ పేపర్‌ పప్పెట్‌ షో ద్వారా విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రగ్స్‌ నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో తనవంతుగా విద్యార్థులకు బొమ్మల ద్వారా అవగాహన కల్పించినట్లు ఆయన చెప్పారు. మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయన్నారు. పల్స్‌ పోలియో, కరోనా, ఈచ్‌ వన్‌ టీచ్‌ వన్‌, మలేరియా, కేన్సర్‌, క్షయవ్యాధితో పాటు కరెంటు టాపిక్స్‌పై బొమ్మల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు.

వంద ట్రాక్టర్ల ఇసుక సీజ్‌


డంప్‌ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న ఆర్‌ఐ బాల్‌రాజ్‌

ఇసుక మాఫియా ఆగడాలకు చెక్‌

తాండూరు రూరల్‌: ఇసుక మాఫియా ఆగడాలకు అధికారులు చెక్‌ పెట్టారు. డంపింగ్‌ యార్డులో నిల్వ చేసిన సుమారు వంద ట్రాక్టర్లకు పైగా ఇసుకను గుర్తించి సోమవారం సీజ్‌ చేశారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చెంగేస్‌పూర్‌ రోడ్డు మార్గంలోని జ్యోతిరావుపులే హాస్టల్‌ భవనం వెనకాల సర్వేనంబర్‌ 83లో ఓ గోదాం ఉంది. పాత తాండూరు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తెచ్చి డంప్‌ చేస్తున్నారు. ఇక్కడి నుంచి టిప్పర్లలో నింపి విక్రయానికి తరలిస్తున్నారు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తాండూరు తహసీల్దార్‌ తారాసింగ్‌కు లేఖ రాశారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన ఆర్‌ఐ బాల్‌రాజ్‌, ఏఎస్‌ఐ పవన్‌కుమార్‌, సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. అక్కడ అక్రమంగా నిల్వ చేసిన సుమారు వంద ట్రాక్టర్లకు పైగా ఇసుకను సీజ్‌ చేశారు. ఉన్నతాధికారులకు ఆదేశాల మేరకు దీన్ని వేలం వేస్తామని తెలిపారు. పర్మిషన్‌ ఉన్నచోట మాత్రమే ఇసుకను డంప్‌ చేయాలని.. వేరో చోటకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు.

చెరువు పనులు పూర్తి చేయిస్తాం

మణికొండ: అర్ధంతరంగా ఆగిపోయిన నెక్నాంపూర్‌ చెరువు అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తానని మణికొండ మున్సిపల్‌ చైర్మన్‌ కె. నరేందర్‌ముదిరాజ్‌ అన్నారు. మున్సిపల్‌ కమిషనర్‌ ప్రదీప్‌ కుమార్‌తో కలిసి చెరువు పరిసరాల్లో గుర్రపు డెక్క తొలగింపు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చెరువులో ఉన్న గుర్రపుడెక్కను తొలగించి, మురుగు నీరు చెరువులో కలవకుండా బాక్స్‌ డ్రైన్‌ల ద్వారా బయటకు వెళ్లేలా చేశారన్నారు. చెరువు సుందరీకరణ, బోటింగ్‌, గ్రీనరీ లాంటి సౌకర్యాలను కల్పించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం రూ. 22 కోట్లతో ఏడేళ్ల క్రితం పనులు చేపట్టినా ఇప్పటివరకు సగం కూడా పూర్తి కాలేదన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఇరిగేషన్‌ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేసేందుకు అవసరమయ్యే నిధులను విడుదల చేయిస్తామన్నారు. అంతవరకు చెరువులో పెరిగిన గుర్రపు డెక్కను మున్సిపాలిటీ తరఫున పూర్తిగా తొలగించి దోమల వ్యాప్తిని నివారిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కె. లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం, నాయకులు జితేందర్‌, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్‌ పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌ లారీలను అడ్డుకోండి

- తాండూరు లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు
- కరన్‌కోట్‌ ఎస్‌ఐ విఠల్‌రెడ్డికి విజ్ఞప్తి


ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీని అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న అసోసియేషన్‌ సభ్యులు

తాండూరు రూరల్‌: తాండూరు ప్రాంతంలో ఓవర్‌లోడ్‌ లారీలను నిలిపివేయాలని లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అబ్దుల్‌ గని, కార్యదర్శి అబ్దుల్‌ షూకూర్‌ కోరారు. సోమవారం మండలంలోని గౌతపూర్‌ శివారులో ఉన్న కరన్‌కోట్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఎస్‌ఐ విఠల్‌రెడ్డిని కాంగ్రెస్‌ నాయకులు పట్లోళ్ల నర్సిములు ఆధ్వర్యంలో లారీ అసోసియేషన్‌ ప్రతినిధులు కలిశారు. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. తాండూరు పట్టణంలో 500 లారీలు ఉన్నాయన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న లారీల్లో ఓవర్‌లోడ్‌తో సిమెంట్‌, నాపరాతి రాయి తరలిస్తున్నారన్నారు. దీంతో స్థానికంగా ఉన్న లారీలకు కిరాయిలు రావడం లేదన్నారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న లారీ యజమానులు ఆర్థికంగా దెబ్బతింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాండూరు లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ సభ్యుల విజ్ఞప్తి మేరకు మార్చి 1 నుంచి ఓవర్‌లోడ్‌ లారీలను అరికట్టాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. వీటిని అరికట్టాలని ఐదు సిమెంట్‌ ఫ్యాక్టరీల యజమానులకు లేఖలు కూడా రాశామన్నారు. ఓవర్‌లోడ్‌ లారీలు అరికట్టాలని ఎస్పీతో పాటు ఆర్‌టీఓ అధికారులకు కూడా విన్నవించామన్నారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు అఫ్రోజ్‌ ఖాన్‌, విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం

తాండూరులో లారీ ఓనర్స్‌ సమస్యలపై ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు పట్లోళ్ల నర్సిములు అన్నారు. లారీ అసోసియేషన్‌కు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిమెంట్‌ ఫ్యాక్టరీల యజమానులు స్థానికంగా ఉన్న లారీలకు సరఫరా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో తాండూరులో ఉన్న రోడ్లు గుంతలమయం అవుతున్నాయన్నారు. ఓవర్‌లోడ్‌ లారీలను అరికట్టాలని ఎమ్మెల్యేతో పాటు ఆర్టీఓ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులకు అండగా ఉంటామన్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలను అసోసియేషన్‌ సభ్యులు అడ్డుకొని కరన్‌కోట్‌ పోలీసులకు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

బొంరాస్‌పేట: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎండీ రవూఫ్‌ వివరాల మేరకు.. మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో ఇటుకబట్టి సమీపంలో ఆదివారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. మద్దిమడుగుతండాకు చెందిన రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

అనుమానం..పెనుభూతమై..

- భార్యను చంపిన భర్త
- నిందితుడి అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: భార్యపై అనుమానంతో భర్త ఆమె తలపై బండరాయితో మోది దారుణంగా హత్య చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు సోమవారం చేసుకుంది. సీఐ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రానికి చెందిన అమిత్‌ సాహు, మధుబాయి(29) దంపతులు ఏడాది క్రితం నగరానికి వలసవచ్చి రాజేంద్రనగర్‌ సర్కిల్‌ శాస్త్రీపురం డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో నివాసం ఉంటూ అదే భవనంలో కూలీలుగా పని చేస్తున్నారు. మధుబాయి తోటి కార్మికులతో చనువుగా ఉంటుండటంతో అమిత్‌ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి ఆమె నిద్రిస్తుండగా బండరాయితో మోదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు వివరించారు.

వాటర్‌ స్పోర్ట్స్‌ అకాడమీలో దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో : విద్యా సంవత్సరానికి (2024–25) గాను వాటర్‌ స్పోర్ట్స్‌ అకాడమీ బోయిన్‌ పల్లిలో ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎస్‌ సంధ్యారాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి లో ప్రవేశానికి గాను బాల బాలికల ఎత్తు బరువు స్టాండింగ్‌ బ్రాడ్‌ జంప్‌, వర్టికల్‌ జంప్‌, మెడిసిన్‌ బాల్‌ త్రో 30 మీటర్లు ఫ్లయింగ్‌ స్టార్ట్‌ ఫ్లెక్సిబిలిటీ టెస్ట్‌ 800 మీటర్ల పరుగు పందెం పోటీల ప్రతిభా ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల గిరిజన బాల బాలికలు రెండు పాస్‌పోర్టు సైజ్‌ ఫోటోలు, బోనఫైడ్‌ ఆధార్‌ జిరాక్స్‌ సర్టిఫికెట్లతో జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం 4వ అంతస్తు కలెక్టర్‌ కాంప్లెక్స్‌ హైదరాబాద్‌లో నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం ఫోన్‌ నెంబర్‌ 8374909268, 955 3554455 ను సంప్రదించాలని సూచించారు.

బిల్డింగ్‌ పైనుంచి పడి వృద్ధురాలి మృతి

రాజేంద్రనగర్‌: బిల్డింగ్‌ పై నుంచి పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరా ల ప్రకారం.. భవానీకాలనీకి చెందిన నితీశ్‌ తన కుటుంబ సభ్యులతో పాటు, తల్లి శారదాదేవి (70)తో కలిసి నివసిస్తున్నాడు. అపార్ట్‌మెంట్‌ నాలుగో అంతస్తులో వీరు ఉంటున్నారు. ఉద యం శారదాదేవి బాల్కనీలో బట్ట లు ఆరేస్తూ ప్రమాదవ శాత్తు పై నుండి కింద పడింది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మే రకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పాలేపల్లిలో ట్యాంకుపై నుంచి వృథాగా పోతున్న తాగునీరు

ఎండల వేళ.. నిర్లక్ష్యమేల?

రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయి. ఈ తరుణంలో బొట్టు బొట్టుని ఒడిసి పట్టుకొని దాహార్తిని తీర్చుకోవాలి. కానీ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి ట్యాంకులు నిండి తాగు నీరు వృథాగా పోతుంది. పాలేపల్లి గ్రామంలో సోమవారం ఈ దృశ్యాలు సాక్షాత్కారమయ్యాయి. మిషన్‌ భగీరథ కింద గ్రామస్తులకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులు నిండి వృథాగా పోతుంది. దీంతో పరిసరాలు బురదమయంగా మారి దోమలు ప్రబలి రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులకు విషయం తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని 'సాక్షి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందన కరువైంది.

– దోమ

రబీకి ప్రణాళిక సిద్ధం చేయండి


రబీ సీజన్‌పై సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్‌

అదనపు కలెక్టర్‌ లింగ్యానాయక్‌

వికారాబాద్‌ అర్బన్‌: రబీ సీజన్‌కి సంబంధించిన ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్‌ లింగ్యానాయక్‌ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన చాంబర్‌లో సివిల్‌ సప్లై, వ్యవసాయ శాఖ, లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌, డీఆర్డిఓ, జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 7,700 ఎకరాలలో వరి ధాన్యం పండించారన్నారు. ఇందులో 1,19,350 క్వింటాళ్ల ధాన్యం ప్యాడిపర్చేస్‌ సెంటర్లోకి వస్తుందని అంచనా వేశారన్నారు. అధికారులు సమన్వయంతో 126 ప్యాడి ప్రొక్యూర్‌మెంట్‌ సెంటర్లను ఓపెన్‌ చేయాలన్నారు. వాటిలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ధాన్యానికి ఎంఎస్‌పీ రేటు వచ్చే విధంగా అన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. మద్దతు ధర గ్రేడ్‌ ఏ రకం రూ.2,203, కామన్‌ రకం రూ.2,083 ఉంటుందన్నారు. అనంతరం రబీ 2023–24 సీఎంఆర్‌ గురించి రైస్‌ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. రైస్‌ మిల్లర్లు రబీకి సంబంధించి సీఎంఆర్‌ రైస్‌ను వెంటనే ఎఫ్‌సీఐకి డెలివరీ చేయవలసిందిగా ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌ఓ రాజేశ్వర్‌, అధికారులు పాల్గొన్నారు.